క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దౌల్తాబాద్: దౌల్తాబాద్ రూరల్ ఫీడర్ పరిధి దేశాయిపల్లి, యాంకి, బాలంపేట ఫీడర్ కింద బిచ్చాల, అల్లాపూర్ గ్రామాల్లో ట్రీ కటింగ్, సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 9గంటల నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ మహిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని గమనించి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న నాయకులు

యాలాల: వేసవి తాపం నుంచి బాటసారులకు ఉపశమనం కలిగించేందుకు దాతలు మజ్జిగ పంపిణీ చేశారు. మండల కేంద్రం చావిడీ సమీపంలో మాజీ సర్పంచ్ పేరి నారాయణరెడ్డి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రం ద్వారా సోమవారం తాగునీరుతో పాటు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు పేరి రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎండాకాలంలో ప్రజల దాహార్తి తీర్చడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు రాపోలు నాగయ్య, ఉపాధ్యక్షులు మోయిజ్, శ్రీనివాస్, కార్యదర్శి అహ్మద్, నాయకులు బుర్నపురి నర్సింహులు, సోఫి, శ్రీనివాస్, రాములు తదితరులు ఉన్నారు.

బొడ్రాయి ప్రతిష్ఠాపన నేడు

తాండూరు రూరల్: మండల పరిధి జినుగుర్తి గ్రామంలో మంగళవారం బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవం జరపనున్నట్లు సోమవారం నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి నగరానికి చెందిన జోగిని నిషాక్రాంతి ప్రత్యేక బోనంతో రానున్నట్లు పేర్కొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు



తండా వాసులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

దోమ: గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీఓ మహేశ్‌బాబు తెలిపారు. సోమవారం మండల పరిధి ఊటుపల్లి తండాలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, గ్రిడ్ ఏఈతో కలిసి ఆయన పర్యటించారు. తాగునీటి సమస్యలపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడారు. గ్రామంలో రెండు ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకులు, రెండు సింగిల్ ఫేస్ మోటార్లు ఉన్నాయని, వాటి ద్వారా ప్రజలకు నీటిని అందిస్తున్నామని చెప్పారు. భగీరథ ట్యాంకు గ్రామానికి పైభాగంలో ఉండటం వలన తగినంతగా నీరు ట్యాంకులకు వెళ్లడం లేదని తెలిపారు. తద్వారా ఇబ్బందులు తలెత్తుతున్నాయని వెల్లడించారు. ట్యాంకులు పూర్తి స్థాయిలో నిండితేనే గ్రామస్తులందరికీ నీరు అందుతాయని పేర్కొన్నారు. ఇప్పటికే సింగిల్ ఫేస్ మోటార్లు, హ్యాండు పంపులు మరమ్మతు చేయించామని, వాటి ద్వారా తాగునీరు సరఫరా అవుతుందని వివరించారు. కార్యక్రమంలో ఊటుపల్లి పంచాయతీ కార్యదర్శి లాల్యానాయక్, బొంపల్లి పంచాయతీ కార్యదర్శి హాలీం తదితరులు పాల్గొన్నారు.

1నుంచి నంబిగురుస్వామి ఉత్సవాలు



మాట్లాడుతున్న నిర్వాహకులు

నవాబుపేట: నంబిగురుస్వామి ఉత్సవాలు 1వ తేదీ నుంచి 5 వరకు జరగనున్నాయని నిర్వాహకులు రఘుపంతులు, పీఏసీఎస్ చైర్మన్ రాంరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నాగిరెడ్డి, మాజీ సర్పంచ్ జగన్‌రెడ్డి, సుదాకర్‌రెడ్డిలు తెలిపారు. మండల పరిధి తిమ్మారెడ్డిపల్లి నంబిగురుస్వామి మఠంలో వారు మాట్లాడారు. సుమారు 500 ఏళ్ల క్రితం నంబిగురు ఇక్కడికి వచ్చి, సజీవ సమాధి అయినట్లు ఆధారాలు ఉన్నాయని వెల్లడించారు. ఆయన సమాధిపై ఉన్న ఉసిరి, మల్లె చెట్లు ఎప్పుడు ఎండిపోతే.. తాను అప్పుడు పూర్తిగా మరణించినట్లు అని అప్పట్లో భక్తులకు తెలిపినట్లు సమాచారం. నాటి నుంచి ఆ చెట్లు సమాధిపై పచ్చగా అలాగే ఉన్నాయని వెల్లడించారు. ఇంతటి చరిత్ర కలిగిన స్వామివారి ఉత్సవాలను ఏటా మే మొదటి వారంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మేడేను జయప్రదం చేయండి

కొందుర్గు: కార్మిక దినోత్సవం సందర్భంగా మే 1వ తేదీన నిర్వహించే జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి కార్మిక, కర్షకులతో పాటు మహిళలు అధిక సంఖ్యలో హాజరై మేడేను జయప్రదరం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య కోరారు.

కాంగ్రెస్‌తోనే దేశానికి మేలు

- సకల జనులకు చేకూరనున్న లబ్ధి
- ప్రభుత్వ సంస్థలను ప్రైవేటు పరం చేయడమే బీజేపీ పని
- ఇంటింటి ప్రచారంలో హస్తం శ్రేణులు
- రంజిత్, వంశీ గెలుపు ఖాయమని ధీమా



నవాబుపేట: నాగిరెడ్డిపల్లిలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవాబుపేట: 'తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది. కేంద్రంలోనూ కొలువు దీరితే.. దేశ అభివృద్ధితో పాటు, పేదలు, రైతులకు మేలు జరుగుతుంది' అని ఆ పార్టీ శ్రేణులు అన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సోమవారం మండల పరిధి నాగిరెడ్డిపల్లి, తిమ్మారెడ్డిపల్లి, కేషవపల్లితండా, కేషవపల్లి, మూలమాడ తదితర గ్రామాల్లో ఆ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటయ్య, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. హస్తం అధికారం చేపడితే.. సకల జనులకు లబ్ధి చేకూరుతుందన్నారు. బీజేపీ పీఠమెక్కితే.. కార్పొరేట్ సంస్థలకు కాపలా ఉండటమే సరిపోతుందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేసేందుకు ఆ పార్టీ కంకణం కట్టుకుందని విమర్శించారు. ప్రజలు ఆలోచించి పేదల పార్టీ అయిన కాంగ్రెస్‌ను గెలిపించుకోవాలని కోరారు. నిరంతరం ప్రజల్లో ఉండే పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని ఆశీర్వదించాలని అభ్యర్థించారు. ఇందులో నాయకులు కొండల్‌యాదవ్, శివప్రసాద్, అశోక్ తదితరులు ఉన్నారు.

మతం పేరుతో ఓట్లడుగుతున్న బీజేపీ

బంట్వారం: ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి గెలుపు ఖాయమని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సిర్రా ఇసాక్ ధీమా వ్యక్తంచేశారు. మండల పరిధి బస్వాపూర్ గ్రామంలో పార్టీ శ్రేణులు ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామాల్లో ఎక్కడికి వెళ్లినా ప్రజలు కాంగ్రెస్‌కు బ్రహ్మరథం పడుతున్నారని చెప్పారు. బీజేపీ నాయకుల మాయ మాటలకు మోసపోవద్దని, మతాన్ని అడ్డం పెట్టుకొని ఓట్లు అడుగుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ఉన్నట్లే.. కేంద్రంలోనూ కాంగ్రెస్ కొలువుదీరితే.. దేశం అభివృద్ధిలో పరుగులు తీస్తుందని వెల్లడించారు.



దౌల్తాబాద్‌లో..

సుల్తాన్‌పూర్‌లో..

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సుల్తాన్‌పూర్‌లో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సోషల్ మీడియా కోఆర్డినేటర్లు అజీం, గౌస్ మాట్లాడారు. చేవెళ్ల పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సుదర్శన్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సిర్రా ఇసాక్, మాజీ సర్పంచులు బర్కత్‌పల్లి నర్సింలు, నర్సింహారెడ్డి, నాయకులు పురుషోత్తం రెడ్డి, వెంకటయ్య, మొగులయ్య, సలీం, యాకుబ్‌అలీ పాల్గొన్నారు.

కూటమి గెలుపు తథ్యం

దౌల్తాబాద్: కాంగ్రెస్ పార్టీతోనే ప్రజలకు మేలు జరుగుతుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్రావు అన్నారు. మండల కేంద్రంలో పార్టీ శ్రేణులు ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా 'పాంచ్ న్యాయ్' పేరుతో పార్టీ ప్రకటించిన ఐదు గ్యారంటీల హామీ కార్డులను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమి గెలుపు ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. పార్టీ పాలమూరు ఎంపీ అభ్యర్థి వంశీచందర్‌రెడ్డిని ఆశీర్వదించి, పార్లమెంటుకు పంపాలని కోరారు. వెంకట్‌రెడ్డి, వీరన్న, దస్తప్ప, సత్యపాల్, మహిపాల్ ఉన్నారు.

'ఉపాధి' కల్పించింది కాంగ్రెస్సే..

ధారూరు: ఉపాధిహామీ పథకం ద్వారా కూలీలకు ఉపాధి కల్పించింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆ పార్టీ నాయకులు అన్నారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా మండల కేంద్రంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనుల గురించి వివరించారు. చేయి గుర్తుకు ఓటేసి, ఎంపీగా రంజిత్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఇందులో పార్టీ నాయకులు మహ్మద్ బాబాఖాన్, అమర్‌పటేల్, బుజ్జయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వంశీచంద్‌ను గెలిపిస్తే.. మరింత అభివృద్ధి



ప్రచారంలో.. మున్సిపల్ చైర్మన్ తదితరులు

కొడంగల్: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్ రెడ్డిని గెలిపించాలని మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండల పరిధిలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఉషారాణి, పార్టీ పట్టణ అధ్యక్షుడు నయీమ్, మిఠాయి రాజు, మురహరి వశిష్టతో కలిసి చైర్మన్ ఇంటింటి ప్రచారం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్ నుంచి గెలిచి.. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నారని, ఎంపీగా వంశీని గెలిపిస్తే మరింత అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు.

అందుబాటులో గన్నీ బ్యాగులు

- ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన అధికారులు
- తొందరపడి వ్యాపారులకు విక్రయించి నష్టపోవద్దని రైతులకు సూచన

సాక్షి ఎఫెక్ట్..

ధారూరు: 'ధాన్యం కొనుగోలు చేసే వారికి ఈ నెల 3న శిక్షణ ఇచ్చాం. కావాల్సిన గన్నీ బ్యాగులు కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయి' అని పౌర సరఫరాల శాఖ జిల్లా అధికారులు తెలిపారు. 'కొనే వారు రాక.. మద్దతు లేక' అనే శీర్షికన సోమవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి పౌర సరఫరాల శాఖ జిల్లా అధికారి రాజేశ్వర్, మేనేజర్ సుగుణాబాయి, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారి సారంగపాణిలు స్పందించారు. మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను వారు పరిశీలించారు. తొలుత కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించేలా చర్యలు తీసుకున్నారు. దీనిని మార్కెట్ గిడ్డంగిలో ఏర్పాటు చేయాలని సొసైటీ సీఈఓ నర్సింలుకు సూచించారు. హార్వెస్టింగ్ అయిన వరిని ఆరబెట్టి, శుభ్రం చేసి తీసుకువచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆదేశించారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

రైతులు నష్టపోవద్దు

ఇప్పటి వరకు జిల్లాలో 129 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని, 9 కేంద్రాలకు మాత్రమే వడ్లు వచ్చాయని అధికారులు వెల్లడించారు. రైతులు తొందరపడి వ్యాపారులకు విక్రయించి, నష్టపోవద్దని సూచించారు. గన్నీ బ్యాగుల కొరత లేదని, కొనుగోలు కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు. ధాన్యం శుభ్రత యంత్రం, టార్పాలిన్లు, సంచులను ఆయా కేంద్రాల్లో ఉంచామని పేర్కొన్నారు. వీరి వెంట తహసీల్దార్ సాజిదాబేగం, ఆర్‌ఐ వీరేశం, మార్కెట్ కార్యదర్శి సిద్దమ్మ ఉన్నారు.

నేటి సభను విజయవంతం చేయండి

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని చిగుళ్లపల్లి మైదానంలో మంగళవారం సాయంత్రం బీజేపీకి మద్దతుగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ నిర్వహించే బహిరంగసభను విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం పిలుపునిచ్చారు. సోమవారం ఆయన వికారాబాద్‌లో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ కోసం మందకృష్ణ తన జీవితాన్ని త్యాగం చేశారని తెలిపారు. ఇప్పటి వరకు ఎస్సీ వర్గీకరణకు ఎవరూ ఏమీ చేయలేదని, ప్రధాని మోదీ మాత్రం వర్గీకరణకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. అందుకోసం లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి అండగా ఎమ్మార్పీఎస్ ప్రచారం చేస్తుందని, అందులో భాగంగానే నేటి సభ నిర్వహణ అని వెల్లడించారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, నాయకులు శివరాజు, వడ్లనందు, నవీన్‌కుమార్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్, బాబు, నర్సింహ, ప్రవీణ్, సుభాష్, రవి, పుష్పలత, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

సేవాభావం అలవర్చుకోండి

బొంరాస్‌పేట: ప్రతి ఒక్కరూ సేవాభావం అలవర్చుకోవాలని శ్రీ గీతాజ్ఞాన గురుభక్త మండలి సద్గురు రామబ్రహ్మానంద స్వామి అన్నారు. సోమవారం మండల పరిధి దుప్‌చర్లలో మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటివైద్య శిబిరానికి స్పందన లభించింది. దీనికి ముందు ధ్యానం, సద్గురు పూజా గురుచాలీసా, గీతాపారాయణం నిర్వహించారు. శిబిరంలో 150 మందికి సాధారణ వైద్యపరీక్షలు చేశారు. 120 మందికి కంటి పరీక్షలు చేయగా.. వీరిలో 22 మందికి కంటి ఆపరేషన్ అవసరమున్నట్లు వైద్యులు గుర్తించి, శస్త్ర చికిత్సకు తరలించారు. ఇందులో ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి, ఎంఎస్ రెడ్డి లయన్స్ క్లబ్ మెంబర్స్, మండలి సభ్యులు వెంకటేశం, నాగప్ప పాల్గొన్నారు.

ఇలా వచ్చారు.. అలా వెళ్లారు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ విజయ్‌కుమార్

- గంటన్నరలో ముగిసిన సర్వసభ్య సమావేశం
- చివరి సమీక్షకు పలువురు ఎంపీటీసీలు, అధికారుల డుమ్మా

దౌల్తాబాద్: చడిచప్పుడు లేకుండా, ఎలాంటి ప్రశ్నోత్తరాలు, సమస్యలపై చర్చించకుండానే సర్వసభ్య సమావేశం ముగిసింది. అంతా గంటన్నర లోపే సద్దుమణిగింది. మరో రెండు నెలల్లో ఎంపీటీసీల పదవీకాలం ముగియనుండగా.. రాని సభ్యులు రానేలేదు. వచ్చిన వారు ఒకటిరెండు సమస్యల గురించి చర్చించి, చేతులు దులుపుకోవడం గమనార్హం.

అన్నింటికీ ఓకే..!

మండల పరిధిలో మొత్తం 15మంది ఎంపీటీసీలు ఉండగా.. సోమవారం ఎంపీపీ విజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమీక్షకు ఎంపీపీతో కలిసి ఏడుగురు ఎంపీటీసీలు హాజరయ్యారు. సమావేశంలో కొందరు అధికారులు తమ శాఖలకు చెందిన నివేదికను నివేదిస్తుండగా.. సభ్యులు కేవలం రెండు సమస్యల గురించి అడిగారు. మిగిలిన వాటికి ఓకే అంటూ తలూపారు. వేసవి నేపథ్యంలో గ్రామాలను తీవ్ర తాగునీటి సమస్య వేధిస్తున్నప్పటికీ.. దాని గురించి సభ్యులు స్పందించకపోవడంపై పలు విమర్శలు వస్తున్నాయి.

ఆలస్యంగా ప్రారంభం..

ఉదయం 11గంటలకు సమావేశం ప్రారంభం కావాల్సి ఉండగా.. 12కు మొదలు పెట్టారు. అనుకున్న సమయానికి దేవర్‌ఫసల్‌వాద్ ఎంపీటీసీ హీరాబాయి వచ్చి, సమీక్ష షురూ కాకముందే సంతకం చేసి వెళ్లిపోయారు. నీటూరు ఎంపీటీసీ గంట ఆలస్యంగా వచ్చారు. 18శాఖల అధికారులు.. నివేదికను నివేదించాల్సి ఉండగా, ఎనిమిది శాఖలకు చెందిన వారు గైర్హాజరయ్యారు. కొంతమంది ప్రత్యేక అధికారులూ రాలేదు. సమావేశానికి హాజరైన అధికారులు ఇలా వచ్చి, అలా నివేదించి వెళ్లారు. సమావేశంలో జెడ్పీటీసీ మహిపాల్ ఉన్నారు.

ఓటు వేయండి.. సమర్థుడిని ఎన్నుకోండి

కొందుర్గు: ఓటుహక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని అంగన్‌వాడీ టీచర్ ఇందిర సూచించారు. సోమవారం రంగారెడ్డి జిల్లా జిల్లేడ్ చౌదరిగూడ మండలం వీరన్నపేట గ్రామంలో ఆమె ఓటరు స్లిప్పులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇందిర మాట్లాడుతూ.. ఓటు వేయకుంటే నష్టపోయేది మనమేనని, ఓటరులో చైతన్యం వస్తేనే మంచి నాయకుడు అధికారంలోకి వస్తాడన్నారు. గ్రామాల అభివృద్ధి కోసం పనిచేసే నాయకుడికి ఓటువేసి గెలిపించాలని సూచించారు.



యాలాల: నాగసముందర్‌లో ప్రచారం చేస్తున్న ఎంపీపీ తదితరులు



దౌల్తాబాద్: ఉపాధి పనుల ప్రాంతంలో కమలనాథుల ప్రచారం

బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం

- మోదీ పరిపాలనతో ప్రజలు సంతృప్తి
- 'కొండా'ను గెలిపిద్దాం.. చేవెళ్లను మోదీకి కానుకగా ఇద్దాం
- ఇంటింటి ప్రచారంలో కమలనాథులు

యాలాల: బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా అన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సోమవారం మండల పరిధి నాగసముందర్ గ్రామంలో పార్టీ శ్రేణులతో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా గుప్తా మాట్లాడారు. బీజేపీ సారథ్యం, మోదీ పాలనపై నేటి తరంతో పాటు వయోజనులు సైతం సంతృప్తిగా ఉన్నారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఉజ్వల యోజన పథకంతో గ్రామీణ ప్రాంతాల్లో గ్యాస్ కనెక్షన్లు పెరిగాయని, పీఎం కిసాన్ ఆర్థిక సాయంతో వ్యవసాయానికి కేంద్రం దన్నుగా నిలిచిందని తెలిపారు. దేశం మరింత అభివృద్ధి చెందాలన్నా, సంక్షేమ ఫలాలు అర్హులందరికీ అందాలన్నా మరోసారి మోదీనీ ఆశీర్వదించాలని కోరారు. ఇందుకు పార్టీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించి, చేవెళ్లను ప్రధానికి కానుకగా ఇవ్వాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు యాదగిరి, మాజీ సర్పంచ్ శివకుమార్, నాయకులు నారాయణ రెడ్డి, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

దౌల్తాబాద్‌లో..

దౌల్తాబాద్: కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి రాజవర్దన్‌రెడ్డి అన్నారు. మండల పరిధి బాలంపేట, నాగసార్, తిర్మలాపూర్‌లో ఆ పార్టీ శ్రేణులు ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. ప్రధాని మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. మరోసారి మోదీని గెలిపించి, అభివృద్ధిని ఆస్వాదిద్దామని పిలుపునిచ్చారు. పార్టీ మండల అధ్యక్షుడు సతీష్, నాయకులు నర్సింలు, త్రివిక్రమ్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ధారూరులో..

ధారూరు: మండల పరిధి కేరెళ్లి గ్రామంలో బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా కమలం గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఇందులో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు వివేకానందరెడ్డి, జిల్లా సీనియర్ నాయకుడు పాండుగౌడ్, మండల అధ్యక్షుడు ఎం.రమేశ్, అధికార ప్రతినిధి రాజేందర్‌గౌడ్, అనిల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మర్పల్లి: బీజేపీతోనే దేశం అన్ని రంగాల్లో పురోగతి సాధించిందని, మరింత ముందుకు సాగాలంటే మోదీని మరోసారి ప్రధానిగా ఆశీర్వదించాలని పార్టీ నియోజకవర్గం సీనియర్ నాయకుడు నవీన్‌కుమార్ కోరారు. మండల పరిధి దామస్తాపూర్‌లో పార్టీ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. ప్రధాని చేపడుతున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం మాట్లాడారు. పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి.. మచ్చలేని నాయకుడని, ఆయనను గెలిపించుకుంటే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని వెల్లడించారు. కావున కమలం గుర్తుకు ఓటువేసి, కొండాను పార్లమెంటుకు పంపాలని అభ్యర్థించారు.



ధారూరులో..

మాయమాటలతో అధికారం కైవసం



ఎన్నికల ప్రచారంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కొప్పుల

- ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ విఫలం
- రాష్ట్ర ప్రభుత్వంపై మాజీ ఎమ్మెల్యే కొప్పుల ధ్వజం
- బీసీ బిడ్డ కాసానిని గెలిపించాలని అభ్యర్థన

పరిగి: మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను తెలంగాణ ప్రజలు నమ్మే స్థితిలో లేరని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధి బసిరెడ్డిపల్లి, మాదారం, పేటమాదారం గ్రామాల్లో పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం చేశారు. కాసానిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం కొప్పుల మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. వంద రోజుల్లో ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటానని చెప్పిన ఆ పార్టీ నేతలు.. అన్ని రోజులు గడిచినా.. హామీలను ఎందుకు నెరవేర్చడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని, శాసనసభ ఎన్నికల్లో ఓటు వేసి తప్పుచేశామని, మళ్లీ ఆ తప్పు చేయబోమని చెబుతున్నారని కొప్పుల వెల్లడించారు. కేసీఆర్ పాలనను గుర్తుకు చేసుకుంటూ.. ప్రశంసిస్తున్నారని పేర్కొన్నారు. చేవెళ్ల పార్లమెంట్ స్థానాన్ని బీసీ బిడ్డకు కేసీఆర్ కేటాయించారని, బీసీలంతా ఏకమై.. కాసానిని పార్లమెంటుకు పంపాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎంపీపీ అరవింద్‌రావు, మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, సీనియర్ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, రాములు తదితరులు పాల్గొన్నారు.

చెప్పనివి చేశాం..

కుల్కచర్ల: బీఆర్‌ఎస్ హయాంలో ఇచ్చిన వాగ్దానాలే కాకుండా.. చెప్పనివి మరెన్నో చేశామని, కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇచ్చిన మాటను తప్పుతూ.. గడువు పెంచుకుంటూ కాలం గడుపుతుందని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి ఆరోపించారు. మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పార్టీ ముఖ్య కార్యకర్తలతో మాట్లాడారు. మోసపూరిత మాటలు చెబుతున్న ప్రభుత్వంపై ప్రజలు విరక్తితో ఉన్నారని పేర్కొన్నారు. ఈ అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, కారు గుర్తుకు ఓటేసేలా ఓటర్లకు అవగాహన కల్పించాలని గులాబీ శ్రేణులకు సూచించారు. పార్లమెంట్‌లో తెలంగాణ వాణి వినిపించాలంటే.. సబ్బండ వర్గాల ఉన్నతికి అహర్నిశలు పాటుపడిన ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పిలుపునిచ్చారు. ఇందులో పార్టీ చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి రాంచందర్ రావు, రాష్ట్ర నాయకులు అనిల్ రెడ్డి, జెడ్పీటీసీ రాందాస్ నాయక్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు, చౌడాపూర్ మండల అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి లక్ష్మయ్య, యువజన విభాగం అధ్యక్షుడు మేగ్యానాయక్, నాయకులు రాజప్ప, కృష్ణయ్య గౌడ్, పాండురంగయ్య, మొగులయ్య, శ్రీనివాస్ ఉన్నారు.

కాంగ్రెస్‌వి మతరాజకీయాలు

తాండూరు: ప్రధాని మోదీ ప్రభంజనం చూసి, ప్రతిపక్ష పార్టీలు బీజేపీపై దుష్ప్రచారం చేస్తున్నాయని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తూళ్ల వీరేందర్‌గౌడ్ ఆరోపించారు. సోమవారం పట్టణంలో నియోజకవర్గ, బూత్‌స్థాయి కమిటీ సభ్యులు, నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశం అభివృద్ధి చెందాలన్నా, అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందాలన్నా.. అది బీజేపీతోనే సాధ్యమని తూళ్ల తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మత రాజకీయాలు చేస్తుందని, ప్రజలను విభజించి ఓట్లు రాబట్టుకునేందుకు కుట్రలు చేస్తుందని ఆరోపించారు. దేశ ప్రజల కోసం నిరంతరం శ్రమిస్తున్న మోదీని ఆశీర్వదించి, పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో యాలాల ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యు.రమేష్‌కుమార్, తాండూరు అసెంబ్లీ కన్వీనర్ రజినీకాంత్, మున్సిపల్ కౌన్సిలర్లు అంతారం లలిత, లావణ్య, బాలప్ప, పట్టణ అధ్యక్షుడు నాగారం మల్లేశం, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణముదిరాజ్, నాయకులు బంటారం భద్రేశ్వర్ తదితరులు ఉన్నారు.

వీడియో గేమ్‌లకు దూరంగా ఉండండి..



డ్యాన్స్ స్టూడియోను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి

తాండూరు టౌన్: వేసవి సెలవుల్లో చిన్నారులు ఉల్లాసంగా, ఉత్సాహంగా గడపాలని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఎస్ఎస్ డ్యాన్స్ అండ్ ఫిట్‌నెస్ స్టూడియోను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం మాట్లాడారు. చిన్నారులు వీడియో గేమ్‌లకు దూరంగా ఉండాలని, భౌతిక శ్రమతో కూడిన ఆటలు, డ్యాన్స్, స్విమ్మింగ్ తదితర వాటిని నేర్చుకోవాలని సూచించారు. వీటి వలన మానసిక, శారీరక దృఢత్వాన్ని పొందుతారని వెల్లడించారు. చిన్నారుల కోసం డ్యాన్స్ స్టూడియో ఏర్పాటు చేసిన డ్యాన్స్ మాస్టర్ రమేష్‌ను ఎమ్మెల్యే అభినందించారు. నేటి నుంచి జూన్ 10వ తేదీ వరకు స్టూడియో కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఎమ్మెల్యేతో కౌన్సిలర్ నీరజ, నాయకులు నర్సింలు, బాల్‌రెడ్డి, మురళీకృష్ణ, మల్లప్ప ఉన్నారు.